మార్పు కోసం ...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

ఎవరికైనా సీటు రాకపోతే అది వారి పొరపాటే




ప్రచురణ: అనంతపురం సంపుటి:13 సంచిక : 179 మంగళవారం 19.12.2023 పేజీలు 4 వేల 2.00 సర్క్యులేటెడ్ బై . విజయవాడ. అనంతపురం. కర్నూలు. కడప. సత్యసాయి. అన్నమయ్య రాయచోటి.

# దేశ చరిత్రలోనే చారిత్రాత్మక ఘటన




## పేదవాడికి మరింత చేరువగా ఆరోగ్యశ్రీ
## వైద్యంకోసం అప్పులు పాలు కాకుండా చర్యలు
## ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు
## ప్రారంభించిన సీఎం జగన్

మిగతా 2 లో

# ఏంటీ జేఎన్.1 కోవిడ్ వేరియంట్..

న్యూఢిల్లీ:డిసెంబర్18మరో ఉదయం



కొత్తగా ఇప్పుడు జేఎన్.1 కోవిడ్ వేరియంట్ విస్తరిస్తోంది. కేరళలోని 78 ఏళ్ల మహిళలో ఆ వైరస్ ఆనవాళ్లను గుర్తించారు. చాలా వేగంగా ఆ వేరియంట్ వ్యాపిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇమ్యూనిటీకి కూడా అది చిక్కదని అంటున్నారు. ఒమిక్రాన్ సబ్ వేరియంట్ బీఏ.1.86 లేదా పిరోలా వేరియంట్‌కు.. జేఎన్.1 వేరియంట్‌ను డిసెండెంట్‌గా భావిస్తున్నారు. 2023 సెప్టెంబర్‌లో తొలిసారి దీన్ని అమెరికాలో గుర్తించారు. ఈ సబ్ వేరియంట్‌కు చెందిన 15 కేసుల్ని చైనాలో కూడా పసికట్టారు.పిరోలా అనే వేరియంట్ దాదాపు 38 దేశాల్లో వ్యాప్తి చెందింది. దాంట్లో ఇండియా కూడా ఉంది. ఇటీవల దేశంలో కరోనా కేసులు మళ్లీ పెరగడానికి ఈ వేరియంట్ కారణమని తెలుస్తోంది. సీడీసీ ప్రకారం బీఏ.2.86 వేరియంట్‌కు 20 మ్యుటేషన్లు ఉన్నట్లు గుర్తించారు. స్పైక్ ప్రోటీన్ల స్టడీ ఆధారంగా ఆ విషయాన్ని అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుతం వ్యాపిస్తున్న జేఎన్.1.. బీఏ.2.8 వేరియంట్లలో ఉన్న స్పైక్ ప్రోటీన్లలో కేవలం ఒక్క మార్పు మాత్రమే ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.జేఎన్.1 వేరియంట్ చాలా వేగంగా వ్యాప్తి అవుతుందని, అది ఇమ్యూనిటీని కూడా తప్పించుకోగలదని నేషనల్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కోవిడ్ టాస్క్ ఫోర్స్ కో చైర్మెన్ రాజీవ్ జయదేవన్ తెలిపారు. జేఎన్.1 వేరియంట్ వల్ల ఊపిరితిత్తుల పైభాగంలో ఇన్‌ఫెక్షన్ అవుతుందని ఢిల్లీలోని గంగా రామ్ ఆస్పత్రి డాక్టర్ ఉజ్వల్ ప్రకాశ్ తెలిపారు. జేఎన్.1 లక్షాల్లో స్వల్ప జ్వరం వస్తుందన్నారు. దగ్గు, ముక్కు దిబ్బడ,గొంతు నొప్పి, ముక్కు కారడం, ముఖం అంతా నొప్పి, తల నొప్పి, కడుపు సమస్యలు తలెత్తనున్నాయి. జేఎన్.1 వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.జేఎన్.1 గురించి ఎక్కువగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జి తెలిపారు.

# తెలంగాణ నుంచి పోటీకి సోనియాకు ఆహ్వానం

తీర్మానించిన కాంగ్రెస్ పిఎసి సమావేశం

17 పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జీల నియామకం

వచ్చే పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా కార్యాచరణ

ఆరుగ్యారెంటీల అమలుకు గ్రామ సభల ద్వారా లబ్దిదారుల ఎంపిక

హైదరాబాద్,డిసెంబర్18(మరో ఉదయం):



కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఈసారి తెలంగాణ నుంచి పార్లమెంట్ స్థానానికి పోటీ చేయాలని తెలంగాణ పీఏసీ తీర్మానించింది. గాంధీ భవన్ లో సోమవారం కాంగ్రెస్ పొలిటికల్ అ్గ÷ర్స్ కమిటీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పీఏసీ చైర్మన్ మాణిక్ రావ్ ఠాక్రే అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కన్వీనర్ షబ్బీర్ అలీ, వీహెచ్ తో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు. ముందుగా అధికారం ఇచ్చిన తెలంగాణ ప్రజలకు పీఏసీ కృతజ్ఞతలు తెలిపింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొలిసారి జరిగిన పీఏసీ సమావేశంలో 5 అంశాలే ఎజెండాగా చర్చించారు. పార్లమెంట్ ఎన్నికల వ్యూహం, నామినేటెడ్ పోస్టుల భర్తీ, ఆరు గ్యారెంటీల అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను పీఏసీ కన్వీనర్ షబ్బీర్ అలీ మీడియాకు వివరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రతీ పార్లమెంట్ సెగ్మెంట్ కు ఒక్కో మంత్రికి ఇంఛార్జీ బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇంఛార్జులను కాంగ్రెస్ పార్టీ నియమించింది. వచ్చే ఏడాది మార్చిలో పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా మంత్రులు, సీనియర్ నేతలను ఇంఛార్జులుగా నియమిస్తూ మార్పులు చేసినట్లు కాంగ్రెస్ హైకమాండ్ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా సీతక్క, పెద్దపల్లి పార్లమెంట్ ఇంఛార్జిగా శ్రీధర్‌బాబు, కరీంనగర్ పార్లమెంట్ ఇంఛార్జిగా పొన్నం ప్రభాకర్, నిజామాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా జీవన్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా పి.సుదర్శన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నియమించింది.మెదక్ పార్లమెంట్ ఇంఛార్జిగా దామోదర్ రాజనర్సింహ, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంఛార్జిగా తుమ్మల నాగేశ్వరరావు, సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ స్థానాల ఇంఛార్జిగా భట్టి విక్రమార్క, చేవెళ్ల, మహబూబ్‌నగర్ స్థానాల పార్లమెంట్ ఇంఛార్జిగా సీఎం రేవంత్‌రెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంఛార్జిగా జూపల్లి కృష్ణారావు, నల్గొండ పార్లమెంట్ ఇంఛార్జిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇంఛార్జిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇంఛార్జిగా కొండా సురేఖ, మహబూబాబాద్, ఖమ్మం స్థానాల పార్లమెంట్ ఇంఛార్జిగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ హైకమాండ్ నియమించింది.

# పైలాన్ ఆవిష్కరించి యువగళం పాదయాత్రను ముగించిన నారా లోకేశ్

## జనవరి 27న కుప్పంలో ప్రారంభమైన లోకేశ్ యువగళం
## 226 రోజుల పాటు సాగిన పాదయాత్ర
## అగనంపూడి వద్ద పైలాన్ ఆవిష్కరణ
## నియంతృత్వంపై ప్రజా యుద్ధమే యువగళం అని నినదించిన లోకేశ్

మరో ఉదయం డిసెంబర్18

జనవరి 27న ప్రారంభమై 226 రోజుల పాటు కొనసాగిన నారా లోకేశ్ యువగళం పాదయాత్ర నేటితో ముగిసింది. విశాఖ జిల్లా అగనంపూడిలో పైలాన్ ఆవిష్కరించిన లోకేశ్ తన సుదీర్ఘ పాదయాత్రకు ముగింపు పలికారు. అంతకుముందు లోకేశ్ భారీ ర్యాలీగా తరలివచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన టీడీపీ, జనసేన శ్రేణులతో గాజువాక జనసంద్రమైంది. పైలాన్ ఆవిష్కరించిన అనంతరం లోకేశ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో నియంతృత్వంపై ప్రజా యుద్ధమే యువగళం అని స్పష్టం చేశారు. అణచివేతకు గురైన వర్గాలకు యువగళం గొంతుక అయిందని అన్నారు. యువగళం ప్రజాగళమై నిర్విరామంగా సాగిందని లోకేశ్ పేర్కొన్నారు. ఒక అసమర్థుడు గద్దెనెక్కి ప్రజాస్వామ్యం దాడి చేశాడని విమర్శించారు. ప్రజాస్వామ్యంపై, వ్యవస్థలపై జరిగిన దాడిని కళ్లారా చూశానని అన్నారు.రాష్ట్రంలో భవిష్యత్తుపై ఆశలు కోల్పోయిన యువతకు యువగళం ద్వారా భరోసా ఇచ్చానని తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీకి కట్టుబడి ఉంటానని లోకేశ్ ఉద్ఘాటించారు. యువగళం పాదయాత్రలో పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నట్టు వెల్లడించారు. కాగా, లోకేశ్ తన పాదయాత్రలో మొత్తం 3,132 కిలోమీటర్లు నడిచారు. 97 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా యువగళం సాగింది. తారకరత్న మృతి, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, చంద్రబాబు అరెస్ట్ వంటి కొన్ని ఘటనల వల్ల పాదయాత్రకు మధ్యలో విరామం ఇచ్చారు.



# పెద్ద ఎత్తున లోకేశ్ యువగళం ముగింపు సభ

## బాబు, పవన్, బాలకృష్ణల హాజరు: అచ్చన్న

అమరావతి,డిసెంబర్18

( మరో ఉదయం):

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర బహిరంగ సభను చరిత్రలో నిలుపుదామని ఏపీ టీడీపీ చీఫ్ అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. యువత ఆశయాలకు అద్దం పట్టే ప్రజాగళంగా మారుద్దామన్నారు. ఒక్క అడుగుతో మొదలై యువత ఆకాంక్షలకు, ఆశయాలకు నిలువుటద్దంగా నిలిచిందని తెలిపారు. 226 రోజులపాటు ప్రజలకు భరోసా కల్పిస్తూ 3132 కిలో మీటర్లు విజయవంతంగా సాగిందన్నారు. విజయనగరం జిల్లా పోలేపల్లిలో నిర్వహిస్తున్న యువగళం - నవశకం సభను చారిత్రాత్మకంగా నిలుపుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ , హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, పార్టీ ముఖ్య నేతలు పాల్గొంటారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఇదిలావుంటే విజయనగరం జిల్లా పోలిపల్లిలో బుధవారం జరిగే యువగళం పాదయాత్ర ముగింపు సభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలను తీసుకెళ్లేందు కు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్సులు అద్దెకు ఇవ్వకుండా ఆటంకాలు సృష్టించడం దారుణమని తెలిపారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా వెనుకాడకుండా భారీగా సభకు తరలిరావాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. యువగళం ముగింపు సభ విజయవంతం చేయాలని టీడీపీ పాలకొండ నియోజకవర్గం ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ కోరారు. నియోజవర్గంలోగల ప్రతి పంచాయతీ నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న యువగళం ముగింపు సభను విజయవంతం చేయాలని టీడీపీ పాలకొండ నియోజకవర్గం ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ, పార్టీ స్టేట్ అబ్జర్వర్ చెల్లుబోయిన శ్రీనివాస్ కోరారు.



మార్పు కోసం ...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## పదేళ్ల పాపాలను కడిగి పారేయాల్సిందే !

పదేళ్ల పాలనలో నరనరానా ఆవరించిన అహంకారంతో..తామే ఇంకా అధికారంలో ఉన్నట్లుగా..తామే తెలంగాణను అభివృద్ధి చేసినట్లుగా..గతంలో కాంగ్రెస్ అంతా పాపాలు చేసినట్లుగా..తెలంగాణ తెచ్చింది తామే అన్నట్లుగా..అప్పులు చేసింది కూడా అభివృద్ధి కోసమే అన్నట్లుగా ..అధికార పక్షాన్ని చులకనగా చేసి మాట్లాడుతూ.. విపక్ష బిఆర్ఎస్ నేత కెటిఆర్ అసెంబ్లీ వేదికగా చేసిన ప్రసంగం చూసిన వారికి ఎవరికైనా ఏవగింపు కలుగుతుంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలపాల్సిన సందర్భం..గవర్నర్ ప్రసంగంలో ఎప్పుడైనా ఆ ప్రభుత్వం ఏం చెప్పదల్చుకుందో మాత్రమే పొందుపరుస్తారు. దాంట్లో నిజానిజాలపై చర్చించాలి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం. పదేళ్ల క్రితం నాటి ఉమ్మడి ఎపి గురించి చర్చించాల్సిన అసవరం ఇప్పుడు లేదు. ఎందుకంటే తెలంగాణ ఏర్పడ్డ తరవాత పదేళ్లుగా టిఆర్ఎస్‌గా ఉన్న బిఆర్ఎస్ పాలించింది. వారి హయాంలో జరిగిన అభివృద్ధి, అవకతవకలే ఇక్కడ ప్రధానం. అయితే తెలివిగా ప్రతిపక్షం అవేవీ చర్చకు రాకుండా ఉండడం కోసం ముందే ఎదురుదాడికి దిగింది. తమ బండారం ఎక్కడ బయటపడు తుందో అన్న భయం లోపల ఉన్నా.. మేకపోతు గాంభీర్యం ప్రదర్శించింది. ఇకపోతే గత దశాబ్దకాలంగా అసెంబ్లీలో చర్చ అన్నది లేకుండా చేశారు. కాంగ్రెస్‌ను నిర్వీర్యం చేయడం ద్వారా ప్రతిపక్షం అన్నది లేకుండా చేశారు. ఉన్న ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి సమావేశాల్లో చర్చలకు ఆస్కారం లేకుండా చేశారు. ఇవన్నీ బిఆర్ఎస్ నేతలు, ముఖ్యంగా కెటిఆర్ మరిచపోయినట్లు ఉన్నారు. తాము 39మందిమి ఉన్నామని, తమకు ఎక్కువ సమయం ఇవ్వాలని పట్టుబట్టడం చూస్తుంటే గురివిందగింజ సామెత గుర్తుకు రాదు. ఇకపోతే కాంగ్రెస్‌ను తిట్టడమే ఇక తమ జీవిత లక్ష్యం అన్న చందాన కెటిఆర్, హరీష్ రావుల ప్రసంగం సాగింది. నిజానికి ఎందుకు ఓడామనే ఇంగితం ఎక్కడా కానరాలేదు. ఎందుకు మమ్మలను ప్రజలు వ్యతిరేకించారో ఆత్మవిమర్శ చేసుకోలేదు. ప్రగతిభవన్ ముందు కంచెను తొలగిస్తే దానిని కూడా ఎద్దేవా చేసిన తీరు దారుణం కాక మరోటి కాదు. అది కాంగ్రెస్ హయాంలోనే నిర్మించారని సుద్దులు పలికారు. నిజంగానే కాంగ్రెస్ హయాంలో వేస్తే ప్రజల కోసం ఎందుకు తొలగించలేదో..దానిని మరింత పటిష్టం ఎందుకు చేసుకున్నారో చెప్పలేకపోయారు. తగుదునమ్మా అంటూ..ఎదురుదాడి చేసే ప్రయత్నం చేసి జనం నవ్వుకునేలా చేసుకున్నారు. నిరంతర కరెంట్ కోసం అప్పులు చేశాయమని, అభివృద్ధి కోసం అప్పులు చేశామని, కాళేశ్వరం బృహత్తర ప్రాజెక్టు అంటూ చర్విత చరణంగా అధికారంలో ఉన్నా..విపక్షంలో ఉన్నా అదే పాటపాడారు. మండలిలో ఎమ్మెల్సీ కవిత, ఇతర బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు కూడా ఇదే తరహాలో ప్రభుత్వాన్ని విమర్శలు చేసే ప్రయత్నం చేశారు. కాళేశ్వరంపై అబద్దాలు ప్రచారం చేస్తూ వచ్చారు. నిజానికి కాళేశ్వరం ద్వారా ఎంత నష్టపోయామో.. ఇంకా ఎంత నష్టపోతున్నామో తెలుసుకునే ప్రయత్నం ఏనాడూ చేయలేదు. కాళేశ్వరం నడపడం కూడా అసాధ్యమని ఆనాడూ,ఈనాడు కూడా మేధావి లోకం హెచ్చరిస్తూనే వచ్చింది. అందుకే కెటిఆర్ అసెంబ్లీలో చేసిన ప్రసంగం చూస్తే ఆత్మరక్షణ కోసం ఎదురు దాడి మంత్రం పఠించారని అర్థం అవుతుంది. ఆత్మస్తుతి పరనింద అన్నచందంగా కొనసాగించారు. దీంతో సిఎం రేవంత్ రెడ్డి కూడా గట్టిగానే..ధీటుగానే జవాబు ఇచ్చారు. అవినీతి బట్టబయలు చేస్తామన్నారు. కూర్చోబెట్టి అవినీతి చిట్టా విప్పుతామన్నారు. అన్నట్లుగానే మేడిగడ్డ కుంగుబాటుపై సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించారు. ఇలా చేయడం వల్ల అసలు నిజాలు బయటకు వస్తాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు దెబ్బతినడం, లీకేజీల విషయంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశాక ప్రజల్లో కూడా చర్చ మొదల య్యింది. ఇది జరాగాలని వారు కూడా

కోరుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత సభ్యులందరినీ మేడిగడ్డ పర్యటనను తీసుకు వెళ్తామని కూడా సిఎం చెప్పారు. గతంలో కాళేశ్వర వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇదే కాంగ్రెస్ సభ్యులు ఎప్పుడు కాళేశ్వరం వెళతామన్నా వెళ్లనీయలేదు. ఏదో లేకపోతే ఎందుకు వెళ్లనీయలేదన్న అనుమానాలు వచ్చాయి. బ్యారేజీ ఎందుకు కుంగిపోయింది.. ఎందుకు పనికి రాకుండా పోయింది..అనే విషయాలన్నీ విచారణలో నిగ్గుతేలుతాయి. బ్యారేజీల కాంట్రాక్టులు ఎవరు ఇచ్చారు..వారి వెనుక ఉన్న మంత్రులు లేదా ఇతరులు ఎవరు...అందులో అధికారుల పాత్ర ఏమిటి..వంటే అనేక విషయాలు బయటకు రావాల్సి ఉంది. అది ప్రజల సొమ్ముతో కట్టినప్పుడు దాని పూర్వాపరాలు తెలుసుకునే హక్కు ప్రజలకు కూడా ఉంది. లక్ష కోట్లు ఖర్చు పెట్టిన ప్రాజెక్టుపై అసలు నిజాలు ప్రజలకు తెలియకుండా దాచడమే పెద్ద నేరం. కానీ దానిని ఓ భూలోక అద్భుతంగా ప్రచారం మాత్రం చేసుకున్నారు. నిజానికి గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనా వైఫల్యా లను సరిదిద్దాల్సిన గురుతర బాధ్యతను ప్రజలు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి అప్పగించారు. అంతేకాదు అవినీతిని వెలికి తీయాలి. ఉద్యోగ నియామకాలపై ఇంతకాలం చేసిన తప్పుడు ప్రకటనల వెనక ఉన్న నిజాలను వెలికితీయాలి. ఎవరెవరు ఎంతెంత ఆస్తులు కూడబెట్టారో వెలికి తీయాలి. ఇసుక, మైనింగ్ దోపిడీలను వెలికి తాయాలి. భూ కబ్జాలపై నిగ్గు తేల్చాలి. ఎంత చెప్పుకున్నా గత బీఆర్ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు నెరవేర లేదన్నది అక్షరసత్యం. ప్రగతిభవన్ కేవలం కెసిఆర్ కుటుంబ సభ్యులకే పరిమిత మయ్యింది. సచివాలయం జర్నలిస్టులకు కూడా అనుమతిలేని పాలనాభవనంగా మారింది. ఇవన్నీ కూడా కాదనలేని నిజాలు. వీటి గురించి కెటిఆర్ మాట్లాడి వుంటే బాగుండేది. కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టు లను చేపట్టడం ఒక ఎత్తయితే అందులో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు అద్భుతం అంటూ గోబెల్స్ ప్రచారాలు సాగించారు. అనవసరమైన ఖర్చులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. ఇకపోతే బిశ్వాల్ కమిటీ సిఫారసుల ప్రకారం రాష్ట్రంలో 1.91లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే భర్తీ చేయడా నికి గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. అందుకే నిరుద్యోగులు ఆందోళన చేసినా వారిని పట్టించుకోలేదు. సర్వీస్ కమిషన్‌ను భ్రష్టు పట్టించారు. ప్రజలను కలిసి వారి సమస్యలు వినే వ్యక్తి సీఎంగా ఉండాలి. సీఎం ను కలవాల్సిన అవసరం ప్రజలకు ఏముందని మూర్ఖంగా వాదించిన కెటిఆర్..అదే తరహాలో అసెంబ్లీలో కూడా వాదించారు. మొత్తంగా బిఆర్ఎస్ ఎత్తుగడ ఏమిటన్నది అర్థం అయ్యింది. ఇవన్నీ అధిగమించి కొత్త సిఎం రేవంత్ రెడ్డి మరింత ధృఢచిత్తంతో ముందుకు సాగాలి. ఈ ప్రభుత్వం ప్రజలదనీ నిరూపించాలి. గత పదేళ్ల పాపాలను కడిపారేయాలి.

# ముగింపుదశకు లోకేశ్ పాదయాత్ర





## పోల్లపల్లిలో ముగింపు సభకు భారీ ఏర్పాట్లు భారీగా టిడిపి కార్యకర్తల సమక్షంలో బహిరంగ సభ

**విశాఖపట్నం,డిసెంబర్18**

**( మరో ఉదయం):**

లోకేశ్ పాదయాత్ర ముగింపుదశకు చేరుకుంది. భారీ ఎత్తున ముగింపు సభను ఏర్పాటు చేసేందుకు టిడిపి శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. చంద్రబాబు గతంలో చేపట్టిన..వస్తున్న మీకోసం పాదయాత్ర ముగిసిన చోటే యువగళం పాదయాత్ర కూడా ముగుస్తుంది. బుధవారం విజయనగరం జిల్లా పోల్లపల్లిలో విజయోత్సవ సభ నిర్వహించనున్నారు. సీఎం జగన్ పాలనలో బాధితులుగా మారిన రాష్ట్ర ప్రజలకు తానున్నానన్న భరోసా కల్పించేందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు అనూహ్య స్పందన లభించింది. ప్రజాగళమై సాగిన ఈ యాత్ర.. ఈ ఏడాది జనవరి 27న కుప్పం శ్రీవరదరాజస్వామి పాదాల వద్ద ప్రారంభమై..ప్రజా చైతన్యమే ధ్యేయంగా ముందుకు సాగింది. 11 ఉమ్మడి జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజకవర్గాలు, 232 మండలాలు, మున్సిపాలిటీ లు, 2,028 గ్రామాల మీదగా పాదయాత్ర కొనసాగింది. 226 రోజుల పాటు 3132 కిలోమీటర్ల మేర యవగళం పాదయాత్ర సాగింది. ఈ ఏడాది జనవరి 27వ తేదీన కుప్పం శ్రీ వరదరాజుస్వామి పాదాల చెంత వద్ద లోకేష్ పాదయాత్ర ప్రారంభమైంది. అనివార్యమైన సందర్భాల్లో మినహా యువగళం పాదయాత్రకు ఏనాడూ విరామం ప్రకటించలేదు. సెప్టెంబర్ 9న చంద్రబాబు అరెస్టుతో పోదలాడ వద్ద పాదయాత్రకు 79 రోజుల పాటు తాత్కాలిక విరామం ఇచ్చారు. ప్రతి జిల్లాలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలకు అనూహ్య స్పందన వచ్చింది. పాదయాత్రలో లోకేష్ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం జీవో నంబర్ 1 సాకుతో లోకేష్ ప్రచార రథం నిలబడ్డ స్టూల్ వరకు లాగేసి గొంతు నొక్కే ప్రయత్నం చేసింది. యువగళం వాలంటీర్లు 40 మందిపై కేసు నమోదు చేయడంతో జైలుకు వెళ్లారు. ప్రతి వంద కిలోమీటర్లకు ఒక హామిల తో కూడిన శిలాఫలకం ఏర్పాటు చేశారు. 97 అసెంబ్లీ నియోజకవర్గంల్లో 70 చోట్ల లోకేష్ బహిరంగ సభలు నిర్వహించారు. దాదాపు మూడున్నర లక్షల మందికిపైగా అభిమానులతో లోకేష్ సెల్ఫీ దిగారు. ఒకేరోజు 2500 మందితో సెల్ఫీలు దిగిన కారణంగా తీవ్రమైన చెయ్యి నొప్పితో బాధపడ్డారు. పెనమలూరు నియోజక వర్గంలో 13 గంటలపాటు ఏకధాటిగా లోకేష్ పాదయాత్ర కొనసాగింది. అడుగడుగునా అభద్రతాభావం, నిరాశానిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలకు తానున్నానన్న ధైర్యం ఇచ్చారు. మొత్తంగా ఈ కాలంలో 70 బహిరంగసభలు, 155 ముఖాముఖి సమావేశాలు, 12 ప్రత్యేక కార్యక్రమాలు, ఎనిమిది రచ్చబండలు నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలనుంచి రాతపూర్వకంగా 4,353 వినతిపత్రాలు అందు కున్నారు. వివిధ సామాజికవర్గాలు, వృత్తులవారు నేరుగా లోకేశ్‌ను కలుసుకుని కష్టాలు చెప్పుకున్నారు. సుదీర్ఘ పాదయాత్రలో కోటిన్నర మంది ప్రజలతో ఆయన మమేకమయ్యారు. పాదయాత్ర చిత్తూరు జిల్లా దాటకముందే రాష్ట్రంలోని 108 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరిగిన 3 ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ విజయదుందుభి మోగించడంతో టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది. గతంలో ఏ పార్టీ నాయకుడూ చేయని విధంగా రాయలసీమలోనే లోకేశ్ సుదీర్ఘ పాదయాత్ర చేశారు. ఏకంగా 124 రోజులపాటు 44 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1,587 కిలోమీటర్లు నడిచారు. రాయలసీమ వాసులు బ్రహ్మరథం పట్టారు. ఉభయ గోదావరి జిల్లాల్లో సాగిన పాదయాత్రకు ప్రజలు వెల్లువలా తరలివచ్చారు. 17 నియోజకవర్గాల పరిధిలో 23 రోజులపాటు సాగిన యాత్ర జనజాతరను తలపించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 11 రోజులపాటు 225.5 కిలోమీటర్లు సాగగా.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో 12 రోజుల పాటు 178.5 కిలోమీటర్లు సాగింది. ఉత్తరాంధ్రలోనూ పాదయాత్రకు ఊహించని స్పందన లభించింది. నిజానికి ఈ యాత్రను శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు నిర్వహించి, అక్కడ ముగింపు సభ ఏర్పాటుచేయాలని భావించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏడు రోజులపాటు 113 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది.పాదయాత్ర వెంబడి తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అధికార యంత్రాంగానికి లోకేశ్ 600కు పైగా లేఖలు రాశారు.

**అమరావతి,డిసెంబర్18**

**( మరో ఉదయం):**

డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ క్రింద చికిత్సల వ్యయ పరిమితి రూ.25 లక్షలకు పెంపు, మరింత మెరుగైన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీతో పాటు లబ్దిదారులకు దిక్సూచిలా పనిచేసే ఆరోగ్యశ్రీయాప్ ను ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించే కార్యక్రమం మొదలయ్యింది. ఉచితంగా వైద్యం ఎలా చేయించుకోవాలి, ఎక్కడకు వెళ్లాలి, ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలి, ఎవరిని అడగాలి అనే ఇలాంటి సందేహాలన్నింటికి వివరంగా ప్రతి ఇంటిలోనూ వివరించే కార్యక్రమానికి నాంది పలికారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి వైయస్సార్ ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం కార్యక్రమంను ముఖ్యమంత్రి వైయస్.జగన్ లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్.వివిధ మండల కార్యాలయాలనుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మండల అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు.కార్పొరేషన్, పురపాలక కార్యాలయాలనుంచి వీసీలో మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సచివాలయాల్లో కూడా సీఎం ప్రసంగాన్ని సిబ్బంది, ఆరోగ్య మిత్రలు వీక్షించారు. .ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ పేదవాడికి మరింత చేరువగా ఆరోగ్యశ్రీ..ఈ రోజు ఈ కార్యక్రమం దేశ చరిత్రలోనే చారిత్రాత్మక ఘటనగా నిలిచిపోతుందన్నారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా, గతంలో మన రాష్ట్రంలోఎప్పుడూ కూడా చూడని విధంగా ఇవాళ వైయస్సార్ ఆరోగ్య శ్రీని పేదవాడికి మరింత చేరువచేస్తున్నాం. దానిమీద పూర్తి అవగహన కల్పిస్తూ... ప్రతి ఇంట్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలి..ఉచితంగా సేవలు ఎలా చేయించుకోవాలి ? ఆరోగ్యం బాగాలేకపోతే ఏం చేయాలి ? ఎవరిని అడగాలి ? ఎక్కడికి వెళ్లాలి ? ఇలాంటి అనుమానాలన్నీ ఎవరి మనసులో కూడా

మొదటి పేజీ తరువాయి

లేకుండా నివృత్తి చేస్తూ.. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య శ్రీకార్డులు ఇస్తూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆరోగ్య శ్రీలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చాం. సంవత్సరానికి రూ.5 లక్షల ఆదాయం వస్తున్న కుటుంబాలను కూడా ఆరోగ్య శ్రీ పరిధిలోకి తీసుకు వచ్చాం. దీనివల్ల 1.48 కోట్ల కుటుంబాలు ఆరోగ్య శ్రీ పరిధిలోకి తీసుకు వచ్చాం. అంటే 4 కోట్ల 25 లక్షల జనాభాను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చాం.మనం అధికారంలోకి రాకమునుపు కేవలం 1059 ప్రొసీజర్లకు మాత్రమే ఆరోగ్య శ్రీ పరిమితమై ఉండేది. మనం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే దాన్ని 2,300 వరకు పెంచుకుంటూపోయాం. ఆ తర్వాత ఇవాళ 3,257 ప్రొసీజర్లకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత చికిత్సలను పెంచాం. రూ.1000 చికిత్స ఖర్చు దాటితే చాలు పేదవాడు ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని... వేయి దాటి ఖర్చయ్యే ప్రొసీజర్లన్నింటిని ఆరోగ్య శ్రీ కిందకు తీసుకు వచ్చాం. పేదవాళ్లు అప్పులు పాలు కాకూడదనే ఉద్దేశంతో ప్రొసీజర్లను విస్తరించాం. మరిన్ని నెట్ వర్క్ ఆసుపత్రులు.గతంలో ఉచిత ఆరోగ్యశ్రీ సేవలు కేవలం 748 ఆస్పత్రులకు పరిమితమైతే ఇప్పుడు 2,513 ఆస్పత్రులకు విస్తరించాం. మన రాష్ట్రంలో 2,309 ఆసుపత్రులకు అందుబాటులో ఉంటే.. . మన రాష్ట్రంలో కాక సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులో ఉన్న హైదరాబాద్‌లో 85, బెంగుళూరులో 35, చెన్నైలో 16 ఆస్పత్రులను కలిపి మొత్తంగా 204 ఆసుపత్రులలో 716 ప్రొసీజర్లకు ఆరోగ్య శ్రీని వర్తింపు

చేశాం. గతంలో మన రాష్ట్రలో కేవలం 748 ఆసుపత్రులకు మాత్రమే పరిమితమైన ఆరోగ్యశ్రీ, బయట కేవలం హైదరాబాద్‌లో మరో 72 కలుపుకుంటే కేవలం 820 ఆసుపత్రులకు మాత్రమే పరిమితమైన ఆరోగ్యశ్రీని.. ఏకంగా 2513 ఆసుపత్రులకు విస్తరింపజేశామని వివరించారు. అప్పట్లో ఆరోగ్యశ్రీ, 108, 104 సేవలన్నింటినీ కలిపి గతంలో 5 సంవత్సరాలలో కేవలం రూ.5,900 కోట్లు ఖర్చు పెడితే... మనం ప్రతి సంవత్సరం ఆరోగ్యశ్రీ సేవలను మెరుగుపరుస్తూ.. ఇప్పటికే రూ.14,439 కోట్లు ఖర్చు చేశాం. 108, 104 సేవలు కూడా కలుపుకుంటే మనం ఏడాదికి రూ.4,400 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఆరోగ్య ఆసరా కింద 25,27,870 మందికి రూ.1,309 కోట్లు చెల్లించాం. ఆరోగ్య శ్రీ కింద ఈ ప్రభుత్వంలో 53,02,816 మంది చికిత్స తీసుకున్నారు. గతంలో ఆరోగ్యశ్రీ కింద క్యాన్సర్ వంటి రోగాలకు రూ.5 లక్షలు దాటితే ఇచ్చేవారు కాదు. కీమోథెరిపీ లాంటిది ప్రారంభిస్తే.. కేవలం రెండు, మూడు డోసులకే రూ.5 లక్షలు అయిపోయింది. ఇక మేం వైద్యం ఆరోగ్యశ్రీ ద్వారా చేయలేం అని వెనక్కి పంపించిన పరిస్థితులు. నామమాత్రంగా మాత్రమే చేసేవారు. మరలా 6 నెలలు తర్వాత ఆ పేషెంట్‌కు క్యాన్సర్ వచ్చేది. వైద్యం లేక ఆ పేషెంట్ చనిపోయిన పరిస్థితి.మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ... క్యాన్సర్‌కి ఎంత ఖర్చైన ఫర్వాలేదు. పూర్తిస్థాయిలో క్యాన్సర్ చికిత్స అందిస్తున్నాం. కాక్లియర్ ఇంపాక్ట్ ఆపరేషన్లు రెండు చెవులకూ చేయిస్తున్నాం. దీనికి రూ.12 లక్షలు అవుతుందంటే దాన్ని కూడా ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చాం. అదే విధంగా బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, రూ. 11 లక్షల ఖర్చయ్యే స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ఎ÷–లాంటేషన్ లాంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా చికిత్స చేస్తున్నాం. గుండె మార్పిడి చికిత్స ఖర్చు కూడా రూ.11 లక్షలు పైనా.. అటువంటి పెద్ద ఖర్చుతో కూడిన ప్రొసీజర్లను ఆరోగ్యశ్రీ కింద తీసుకొచ్చి ఉచితంగా చికిత్సలు అందించాం.ఇలా ప్రాణాంతకమైన ఈ వ్యాధులకు సంబంధించి 1,82,732 మందికి ఆరోగ్యశ్రీలో పెద్ద ఖర్చుతో కూడిన ప్రొసీజర్స్‌లకు సైతం ఉచితంగా చేస్తూ తోడుగా నిలబడ్డామని వివరించారు. మొత్తంగా 28 మెడికల్ కాలేజులు ప్రభుత్వరంగంలో అందుబాటులోకివస్తున్నాయి. ప్రతి పార్లమెంటుని జిల్లా చేసాం. ప్రతి జిల్లా పరిధిలో ఇవాళ ఒక మెడికల్ కాలేజీ అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల అక్కడే ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వస్తుంది. అక్కడే పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్, ప్రొఫెసర్లు వస్తారు. ఇది పేదవాడికి సహాయం చేయగలిగే గొప్ప వ్యవస్థ. ప్రభుత్వ రంగంలో ఆసుపత్రులకు ఎక్కడకు వెళ్లినా సిబ్బంది ఉండరనే పరిస్థితులను మార్చివేశాం. గతంలో ఎప్పుడూ చూడని విధంగా 53,126 మంది డాక్టర్లు, నర్సులు, పారామెడిక్స్ వంటి వైద్య సిబ్బందిని నియమించాం.స్పెషలిస్టుల నియమాకాల్లోనూ...జాతీయ స్థాయిలో ప్రభుత్వాసుపత్రుల్లో స్పెషలిస్టు డాక్టర్ల కొరత 61శాతం అయితే, మన రాష్ట్రంలో ఈకొరత కేవలం 3.96 శాతం మాత్రమే ఉంది. వీటిని కూడా ఖాళీలు లేకుండా చూసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం.ప్రతి పీహెచ్‌సీలోనూ ఇద్దరు డాక్టర్లు చొప్పున నలుగురు డాక్టర్లను తీసుకురావడం జరిగింది. ఇందులో ఇద్దరు పీహెచ్‌సీల్లో ఉంటే, మరో ఇద్దరు 104 వాహనంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలకు వెళ్తున్నారు. విలేజ్ క్లినిక్స్‌తో వీరు అనుసంధానం అయ్యారు. వైద్యరంగంలో అన్ని ప్రభుత్వాసుపత్రుల్లోనూ నాడు ? నేడు కింద కార్యక్రమాలు చేపట్టాం. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా, టీచింగ్ ఆశు పత్రులు అన్నింటిచోట్లా... పాతవాటిని బాగుచేయడంతో పాటు... అవసరం అయిన చోట కొత్తవి వస్తున్నాయి. మౌలిక సదుపాయాలన్నింటిలోనూ జాతీయ స్థాయి ప్రమాణాలను పెంచుతుందని వివరించారు. ప్రతి ఫోన్‌కు ఆరోగ్య శ్రీకి సంబంధించి ఎలా వినియోగించుకోవాలన్నదానిపై 6 నిమిషాల వీడియో కూడా మీ అందరి ఫోన్లకు పంపిస్తున్నాం. ఏఎన్ఎంలు, సీహెచ్ఓలు, ఆశావర్కర్లు,

ప్రజాప్రతినిధులు ఇలా ప్రతీ ఇంటికి ఎవరెవరు వెళ్తున్నారో వాళ్లు ఎఫెక్టివ్‌గా ప్రజలకు అర్థమైనట్లు చెప్పాలి. అందుకోసం వైద్యఆరోగ్యశాఖ ఈ 6 నిమిషాల వీడియో మెసేజ్ కూడా తయారు చేశారు. దీన్ని కుటుంబాలన్నింటికీ చూపించండి. వారిఫోన్లలో కూడా వీడియోను ఉంచండి. దీన్ని ప్రతి కలెక్టర్, ఎస్పీ బాధ్యతగా తీసుకోవాలి. ప్రతి ఇంటికి ఈ మెసేజ్ పోవడం వల్ల ఏ ఇంటిలోనూ ఏ పేదవాడూ వైద్యం కోసం ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి రాకుండా ఉంటుంది. అందుకే అధికారులందరూ బాధ్యత తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

మొదటి పేజీ తరువాయి

# ఎవరికైనా సీటు రాకపోతే అది వారి పొరపాటే

**ఇటీవల 11 నియోజకవర్గాలకు ఇన్చార్జిలను మార్చిన జగన్**

**కష్టపడి పనిచేసేవారికి సీట్లు ఎక్కడికీ పోవని రోజా వెల్లడి**

**ప్రజల్లో ఉండాలని జగన్ చెబుతున్నారన్న రోజా**

**ఇంకొందరు సీట్లు రావని వాళ్లకై వాళ్లే ఊహించుకుంటున్నారని వ్యాఖ్యలు**

ఇటీవల ఏపీ సీఎం జగన్ రాష్ట్రంలోని 11 నియోజకవర్గాలకు ఇన్చార్జిలను మార్చిన సంగతి తెలిసిందే. పలువురు మంత్రులు కూడా ఈసారి ఇతర నియోజకవర్గాల నుంచి పోటీ చేయాల్సిన పరిస్థితి ఉందని సీఎం నిర్ణయంతో స్పష్టమైంది. దీనిపై ఏపీ మంత్రి రోజా స్పందించారు. ప్రజల్లో ఉంటూ కష్టపడి పనిచేసిన వారికి సొంత నియోజకవర్గం సీట్లు ఎక్కడికీ పోవని, వారి సీట్లు వారికే ఉంటాయని అన్నారు. మంత్రుల విషయానికొస్తే, తమ నియోజకవర్గంలో బలంగా ఉంటారు కాబట్టి, ఒకవేళ వారిని ఇతర నియోజకవర్గానికి మార్చినా ఆ రెండు నియోజకవర్గాల్లో గెలిపించే బాధ్యత ఆ మంత్రులకు అప్పగించడం అనేది అందరికీ తెలిసిందేనని వివరించారు. "ఇక ఎవరికైనా ఈసారి ఎన్నికల్లో సీటు లేదు అంటే అది వారి పొరపాటే అవుతుంది. నాలుగున్నర సంవత్సరాలు మనకు అవకాశం ఇచ్చారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ప్రజల వద్దకు వెళ్లే గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం గురించి సీఎం జగన్ చిన్న పిల్లలకు చెప్పినట్టు చెప్పారు... నాకు మిమ్మల్ని ఎవర్నీ వదులుకోవడం ఇష్టంలేదని, మనం అందరం కలిసి ప్రయాణం చేద్దాం అని చెప్పారు. నా వరకు నేను ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఎంత కష్టమైనా కూడా నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాను... ఎక్కడా ఎవరికీ ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నాను... మీరు కూడా మీ మీ నియోజకవర్గాల్లో మీపై చెడు అభిప్రాయం లేకుండా చూసుకోండి... ప్రజల్లో ఉండండి అని జగన్ చెప్పారు. ఇక దీనికి సంబంధించి సర్వేలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఎవరికైనా సీటు మిస్ అయిందీ అంటే అది వారి పొరపాటే అవుతుంది తప్ప జగన్ మోహన్ రెడ్డి గారి పొరపాటు కాదు. కొందరు తమకు సీట్లు రాలేదని వాళ్లకై వాళ్లే ఊహించుకుంటే మనమేం చేయలేం. ఏదైనా మార్పులు చేర్పులు చేయాల్సి వస్తే వాళ్లను పిలిచి రెండు మూడు పర్యాయాలు చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటున్నారు తప్ప... ఎక్కడా కూడా గుడ్డిగా మార్పులు చేయడం లేదు" అంటూ మంత్రి రోజా వివరించారు.

మరో ఉదయం

# అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంపై విషప్రయోగం

## చికిత్స కోసం కరాచీ ఆస్పత్రిలో

## చేర్చినట్లు ప్రచారం

## పాక్‌లో ముందు జాగ్రత్తగా

## ఇంటర్‌నెట్ సేవల నిలిపివేత

**కరాచీ,డిసెంబర్18( మరో ఉదయం):**

పరారీలో ఉన్న అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం విషప్రయోగంతో పాకిస్థాన్‌లోని కరాచీ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరినట్లు సమాచారం. విషప్రయోగం కారణంగా అతన్ని ఆసుపత్రికి తరలించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయాన్ని పాక్ అధికారికంగా ధ్రువీకరించ లేదు. సంబంధిత ఆసుపత్రిలో గట్టి నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. 1993 ముంబై పేలుళ్ల సూత్రధారి, భారత్ మోస్ట్ వాంటెడ్ డాన్ దావూద్ ఇబ్రహీం చాలా సంవత్సరాలుగా పాకిస్థాన్‌లో ఉంటున్నాడు. ముంబై దాడుల్లో 250 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోగా వేలాది మంది గాయపడ్డారు. ఈ పేలుళ్ల ప్రణాళిక, అమలులో అతని ప్రమేయం ఉందన్న ఆరోపణలలో భారత్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులలో ఒకడిగా దావూద్ ఉన్నాడు. 2008లో 26/11 ఉగ్రదాడుల సమయంలో 10 మంది పాకిస్తానీ ఉగ్రవాదులకు దావూద్ ముంబైలో ఉన్న తన నెట్‌వర్క్ ద్వారా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని సరఫరా చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. కరాచీలో దావూద్ ఇబ్రహీం ఉన్నాడని భారత్ సాక్ష్యాలను సమర్పించినప్పటికీ అతనికి తాము ఆశ్రయం ఇవ్వలేదని పాక్ తిరస్కరిస్తూ వస్తోంది. ముంబై పోలీసులు దావూద్ ఆసుపత్రిలో చేరడంపై అతని బంధువులు అలీషా పార్కర్ , సాజిద్ వాగ్లే నుంచి సమాచారాన్ని రాబట్టేందుకు యత్నిస్తున్నారు. అతను రెండో పెళ్లి చేసుకున్న తర్వాత కరాచీలో ఉంటున్నాడని సోదరి హసీనా పార్కర్ కుమారుడు ఎన్ఐఏకి వివరించాడు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మనీలాండరింగ్, దోపిడీ, ఆయుధాల స్మగ్లింగ్ వంటి నేర కార్యకలాపాలలో పాల్గొన్నాడు. అతన్ని చంపితే 25 మిలియన్ డాలర్లు ఇస్తామని గతంలో భారత్ ప్రకటించింది. అల్ ఖైదా ఉగ్రవాద సంస్థతో కూడా అతనికి సంబంధాలు ఉన్నాయి. ఈ క్రమంలో అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంపై విషప్రయోగానికి పాల్పడ్డారనే వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆయనకు కరాచీలో విషప్రయోగం జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. పాకిస్తాన్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నివేదికల ప్రకారం, అతని పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రిలో చేరారు. దావూద్‌పై విషప్రయోగం జరిగిందన్న వార్తలను అధికారికంగా ఎవరూ ఇంత వరకు ధృవీకరించలేదు. దావూద్ చికిత్స పొందుతున్న ఆసుపత్రిలో కట్టుదిట్టమైన భద్రత ఉందని చెబుతున్నారు. ఆ ఆస్పత్రిలో దావూద్ ఒక్కడే పేషెంట్. ఆ ఆస్పత్రిలో పాకిస్థాన్ ఉన్నతాధికారులు, వారి కుటుంబ సభ్యులకు మాత్రమే చికిత్స అందిస్తుంటారు. దావూద్‌పై పాకిస్థాన్‌లో విషప్రయోగం జరిగిందన్న వార్త తర్వాత దేశంలో కలకలం రేగింది. పాకిస్థాన్‌లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. సర్వర్ డౌన్ కారణంగా సేవలు నిలిచిపోయినట్టు వార్తలు వస్తున్నాయి. దేశంలోని పలు పెద్ద నగరాలైన లాహోర్, కరాచీ, ఇస్లామాబాద్ లలో కూడా సర్వర్ డౌన్ అయింది. ఇవే కాకుండా ఎక్స్, ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ కూడా పనిచేయడం లేదని పేర్కొన్నారు. రాత్రి 8 గంటల నుంచి ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నెట్, సైబర్ భద్రత, డిజిటల్ గవర్నెన్స్‌ను పర్యవేక్షించే నెట్బ్లాక్ అనే సంస్థ పాకిస్తాన్‌లో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై నిషేధాన్ని ధృవీకరించింది. దావూద్ ఇబ్రహీంపై ఎవరో విషప్రయోగం చేశారని, ఆ తర్వాత అతని ఆరోగ్యం క్షీణించిందని వార్తలు వస్తున్నాయని పాక్ జర్నలిస్ట్ ఒకరు అన్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని, కరాచీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారని, ఈ వార్త కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అది ఎంతవరకు నిజమో తెలియదు కానీ ఏదో జరుగుతోందనే విషయం మాత్రం తెలుస్తోంది.

# పవన్ ,చంద్రబాబుల మధ్య మేనిఫెస్టో చర్చ

## రెండు అంశాలపై

## ప్రధాన చర్చ జరిగిందన్న చినరాజప్ప

**విశాఖపట్నం,డిసెంబర్18( మరో ఉదయం):**

టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భేటీలో మొత్తం రెండు అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయని మాజీ మంత్రి,టిడిపి సీనియర్ నేత చినరాజప్ప తెలిపారు. ప్రధానంగా వచ్చే ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలన్నదే ఇందులోని అంశమని అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. పొత్తులు ,ఉమ్మడి మేనిఫెస్టోపై సుదీర్ఘంగా చర్చించారన్నారు. పొత్తులపై ఇప్పటికే పార్టీ అధిష్టాన నేతలు ఒక అవగాహనకు వచ్చారన్నారు. జనసేనకు బలం, గెలిచే అవకాశంలో చోటే సీట్లు ఇచ్చే దశగా ఆలోచనలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పేరుతో టీడీపీ మినీ మేనిఫెస్టో జనంలోకి వెళ్ళిందని తెలిపారరు. జనసేన సూచించిన మరికొన్ని అంశాలతో కలిపి త్వరలోనే పూర్తిస్థాయి మేనిఫెస్టోను విడుదల చేస్తామన్నారు. రాయలసీమ లేదా గుంటూరు కృష్ణా జిల్లాలో భారీ బహిరంగ సభ ద్వారా మేనిఫెస్టో విడుదల చేస్తామన్నారు. ఇప్పటికే పలుమార్లు జరిగిన భేటీలో పలు కీలక అంశాలపై ఇరు పార్టీలు అవగాహనకు వచ్చాయని చినరాజప్ప వెల్లడించారు.

# వైఎస్ వివేకాహత్యకేసులో ట్విస్ట్

## సునీత దంపతులపై కేసు నమోదు

## సీబీఐ ఎస్పీ రాంసింగ్‌పైనా కేసు

## పులివెందుల కోర్టు ఆదేశాలతో పోలీసుల చర్య

**కడప,డిసెంబర్18( మరో ఉదయం):**

వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కొత్త ట్విస్ట్ నెలకొంది. వివేకా కుమార్తె సునీత రెడ్డి, ఆమె భర్త రాజశేఖర్ రెడ్డిలపై పులివెందుల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీబీఐ ఎస్పీ రామ్ సింగ్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు.. అలాగే వివేకా పిఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు పులివెందుల అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. పులివెందుల పోలీసులు వివేకా కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖర రెడ్డి , కేసు దర్యాప్తు చేపట్టిన సీబీఐ ఎస్పీ రాంసింగ్‌లపై కేసు నమోదు చేశారు. వివేకా హత్య కేసులో కొందరు తనను బెదిరిస్తున్నారని ఆయన పీఏ కృష్ణారెడ్డి గతంలో పులివెందుల కోర్టును ఆశ్రయించారు. సీబీఐ అధికారులు కొందరి నేతలపేర్లు చెప్పాలని తనను బెదిరిస్తున్నట్లు గా కోర్టు దృష్టికి తెచ్చారు. వివేకా హత్య కేసులో పులివెందులకు చెందిన కొందరు నాయకుల ప్రమేయం ఉందనేలా సాక్ష్యం చెప్పాలని ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. సీబీఐ ఎస్పీ రాంసింగ్ బెదిరింపులకు పాల్పడ్డారని పిటిషన్ లో వివరించారు. సీబీఐ అధికారులకు అనుకూలంగా వ్యవహరించాలని వివేకా కుమార్తె, అల్లుడు కూడా తనను బెదిరించారని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని అప్పట్లో ఎస్పీగా ఉన్న అన్బురాజన్ ను కలిసి వినతిపత్రం అందజేశానని వివరించారు. రక్షణ కల్పించాలని పోలీసులను కోరినా ఫలితం లేకపోవడంతోనే తప్పనిసరి పరిస్థితుల్లో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు, కృష్ణారెడ్డి ఫిర్యాదుపై విచారించి వివేకా కుమార్తె, అల్లుడు, సీబీఐ ఎస్పీలపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 15వ తేదీన పులివెందుల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కృష్ణారెడ్డి 2021 ఫిబ్రవరిలో పులివెందుల కోర్టులో పిటిషన్ వేశారు. విచారణ సందర్భంగా ఎస్పీ రామ్ సింగ్ వేధించారని, సునీత, రాజశేఖర్ రెడ్డి కూడా సీబీఐ చెప్పినట్లు నడుచుకోవాలని తనను బెదిరించినట్లు కోర్టులో పిటిషన్ వేశారు.

# హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ చిక్కులు తొలగేనా?

## ప్రధాన రూట్లలో నిత్యం ట్రాఫిక్ రద్దీతో ఇబ్బందులు యూటర్న్‌లతో వాహనదారుల తీవ్ర యాతనలు

**హైదరాబాద్,డిసెంబర్18 ( మరో ఉదయం):**

కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక, సిఎం రేవంత్ ఆదేశాలతో నగరంలో కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం ఏర్పడుతోంది. అయితే ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. వీటిపై ప్రధానంగా దృష్టి సారించాలి. కేవలం పోలీసులు చలాన్లు వేయడం, చాటుమాటున ఫోటోలు తీయడం, బ్యారికేడ్లు పెట్టి డ్రంకన్ డ్రైవ్‌లు చేయడంతోనే సరిపెడుతున్నారు. ఇకపోతే నగరంలో పలుచోట్ల యూటర్న్ లు పెట్టి అసలు పోలీసులు లేకుండానే ట్రాఫిక్‌ను పోనిచ్చే పని చేపట్టారు. దీనిని సవరించాల్సి ఉంది. రోడ్డు మధ్యలో సిమెంట్ దిమ్మెలు ప్రమాదకరంగా మారాయి. లాకాకుండా సిగ్నలింగ్ వ్యవస్థను పటిష్టం చేసి, దానిని ఫాలో అయ్యేలా చర్యలు తీసుకోవాలి. కానీ గత పదేళ్లలో దీనిపై ఎక్కడా శ్రద్ధ కానరాలేదు. ఇప్పటికైనా దీనిపై సిఎం ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది. ఎందుకంటే ఇనుప కంచెలను తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేస్తున్న తరుణంలో ప్రధాన ట్రాఫిక్ సమస్యలపై చర్చించాల్సి ఉంది. ప్రగతిభవన్ ముందు, అసెంబ్లీ ముందు ఇనుప కంచెలు తొలగించడంతో ప్రజలు స్వాగతిస్తున్నారు. మరోవైపు సిటీలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు పోలీసులు యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నారు. సెక్రటేరియట్, అసెంబ్లీ, బేగంపేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా సీఎం, మంత్రుల కాన్వాయ్‌లు వెళ్లే రూట్లను స్టడీ చేస్తున్నారు. సాధారణ ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటు న్నారు. ఇందులో భాగంగా అసెంబ్లీ ముందు ఉన్న గన్‌పార్క్ జంక్షన్‌ను సిగ్నల్ ఫ్రీ జంక్షన్‌గా మార్చారు. నాంపల్లి, లక్డీకపూల్ వైపు నుంచి వచ్చే వాహనాలు ఆగకుండా ఏర్పాట్లు చేశారు. బషీర్‌బాగ్ నుంచి లక్డీకపూల్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను ఏఆర్ పెట్రోల్ బంక్ వద్ద యూటర్న్ చేశారు. బషీర్‌బాగ్ ఫ్లై ఓల్గ÷వర్ వైపు నుంచి వచ్చే వెహికల్స్.. ఓల్డ్ ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ వద్ద లెఫ్ట్ టర్న్ తీసుకుని ఏఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో యూ టర్న్ తీసుకుంటున్నాయి. దీంతో పబ్లిక్ గార్డెన్స్, అసెంబ్లీ ముందు వెహికల్స్ నిలిచే అవకాశం ఉండదు. ఈ ట్రయల్ రన్ మంచి ఫలితాలు ఇస్తే యూటర్న్‌ను కంటిన్యూ చేయాలని ట్రాఫిక్ పోలీసులు ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే సెక్రటేరియట్ పరిసర ప్రాంతాల్లోనూ సిగ్నల్ ఫ్రీ సిస్టమ్‌ను అమలు చేస్తున్నారు. సీఎం, మంత్రుల కాన్వాయ్ మూవ్‌మెంట్స్ సమయాల్లో సాధారణ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే ప్లానింగ్ రూపొందిస్తున్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే బేగంపేట పరిసరాలపై పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు.

# పవన్‌తో చంద్రబాబు భేటీపై అంబటి విమర్శలు

## తిప్పికొట్టిన మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు

**అమరావతి,డిసెంబర్18 ( మరో ఉదయం):**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్ళిన తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడుపై మంత్రి అంబటి రాంబాబు వ్యంగ్య ట్వీట్ చేశారు. దత్తపుత్రుడి ప్పాపకం కోసం పాకులాడుతున్నారని అన్నారు. అలాగే వచ్చే ఎన్నికల్లో ఎవరెవరు కలిసినా గెలుపు జగన్‌దేనని అన్నారు. దీనిపై టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు.. మంత్రి అంబటికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'అంబటికు సీట్ పోయింది... ట్వీట్ మిగిలింది' అయ్యయ్యో అంబటి.. అంటూ కౌంటర్ ఇచ్చారు.

కాగా టీడీపీ అధినేత చంద్రబాబు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో ఆదివారమిక్కడ భేటీ అయ్యారు. ఏపీలో మార్చిలోనే ఎన్నికలు జరగొచ్చని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఎన్నికల సన్నద్ధత, సీట్ల సర్దుబాటుపై సమీక్షించారు. ఉమ్మడి మేనిఫెస్టో, కలిసి బహిరంగసభల నిర్వహణ, ఉభయుల పొత్తు బలోపేతం, ఎన్నికల వ్యూహరచనపై చర్చించారు. ఈ రెండు పార్టీలూ కలిసే ఎన్నికల్లో పోటీచేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ పార్టీల అగ్రనేతలు తరచూ భేటీ అవుతున్నారు. పవన్ కొద్దిరోజుల కిందట చంద్రబాబు నివాసానికి వెళ్లగా.. టీడీపీ అధినేత ఆదివారం రాత్రి మాదాపూర్‌లోని పవన్ నివాసానికి వెళ్లారు. 2014 ఎన్నికల తర్వాత ఆయన జనసేనాని నివాసానికి వెళ్లడం ఇదే తొలిసారి. ఆయనకు పవన్ సాదరంగా

స్వాగతం పలికారు. అనంతరం సుమారు రెండున్నర గంటల పాటు చర్చలు జరిగాయి. ఏపీలో రాజకీయ పరిస్థితులు, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. రెండు పార్టీల ఉమ్మడి మేనిఫెస్టో విడుదల కార్యక్రమంపై సమీక్షించారు. చంద్రబాబు, పవన్ ఫొటోలతో ముద్రించిన ఉమ్మడి మేనిఫెస్టోను రూపొందించనున్నట్లు సమాచారం. ఎప్పుడు దీనిని విడుదల చేస్తారో త్వరలోనే తేదీని ఖరారు చేయనున్నారు. సూపర్ సిక్స్ పేరుతో మహానాడులో టీడీపీ మినీ మేనిఫెస్టో ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి జనసేన మరికొన్ని అంశాలు జోడించి మొత్తం 10 అంశాలతో ఉమ్మడిగా ప్రజల్లోకి వెళ్లనున్నాయి. యువత, మహిళలు, రైతులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి సంబంధించి జనసేన కొన్ని సూచనలు చేసింది. కాగా.. తన కార్యక్రమాల షెడ్యూల్ ముందుగానే ఖరారు కావడంతో.. ఈ నెల 20న విశాఖలో జరిగే యువగళం ముగింపు సభకు హాజరుకాలేకపోతున్నానని పవన్.. చంద్రబాబుకు తెలిపినట్లు జనసేన



వర్గాలు పేర్కొన్నాయి. ఈ భేటీలో జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. సమావేశ వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. 'అధినేతల భేటీ చాలా సంతృప్తికరంగా సాగింది. అనేక అంశాలపై చర్చలు సుహృద్భావంగా జరిగాయి. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ సాధనే ఉమ్మడి ధ్యేయంగా వచ్చే ఎన్నికల్లో సమష్టిగా ఎలా ముందుకెళ్లాలి.. ఉమ్మడి మేనిఫెస్టోను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం.. రెండు పార్టీల కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ఎలా ముందుకు సాగాలో సమష్టి కార్యాచరణ తీసుకున్నాం. భావి రాజకీయ కార్యాచరణ, ఎన్నికల యాక్షన్ ప్లాన్‌పై చర్చించాం. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై అధినేతలు పూర్తిస్థాయిలో చర్చించారు. పాలక వైసీపీని దీటుగా ఎదుర్కోవడమే గాక.. ఆంధ్రప్రదేశ్‌ను వైసీపీ విముక్త రాష్ట్రం చేసేందుకు అవసరమైన అన్ని అంశాలపై మాట్లాడుకున్నారు. భేటీలో చర్చకు వచ్చిన ఇతర కీలక అంశాల గురించి తర్వాత ప్రత్యేక మాట్లాడతాం' అని వివరించారు. దీనిపై అంబటి చేసిన వ్యాఖ్యలపై మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు ఘాటుగా స్పందించారు.

# ప్రజాసంక్షేమం లక్ష్యంగా జగన్ పాలన

## ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

**కాకినాడ,డిసెంబర్18( మరో ఉదయం):**

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను తెచ్చి, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందిస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. గత టీడీపీ పాలనలో ఇసుక, మట్టిని ఇష్టారాజ్యంగా దోచుకు తిన్నారని, వైఎస్సార్ సీపీ పాలనలో అలాంటివి లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందించామన్నారు. టీడీపీ నాయకులు మాఫియాగా తయారై, మట్టి, ఇసుక దోచుకున్నారని విమర్శించారు. పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వలేని పార్టీ టీడీపీ అని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని, దీనిని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్నదని, అందులో భాగంగానే రైతులకు సబ్సిడీపై ఎరువులు, యంత్ర పరికరాలు, రైతు భరోసా వంటివి అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సి క్లాస్ భూములను సాగు చేస్తున్న రైతులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు యజమానులుగా చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం పదేళ్లుగా పట్టాలివ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. త్వరలో ఎన్నికలు రాబోతున్నాయని, టీడీపీ, జనసేన పార్టీలు కలిసి కట్టుగా వస్తున్నాయని, ప్రజలు మేలు చేసే ప్రభుత్వాన్ని గుర్తించి ఆదరించాలన్నారు.

# మద్యంమత్తులో కారు డ్రైవింగ్

## ప్రమాదంలో పాదచారి దుర్మరణం

**హైదరాబాద్,డిసెంబర్18( మరో ఉదయం):**

చైతన్యపురిలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మద్యం మత్తులో యువకుల కారు నడపడంతో జరిగిన ప్రమాదంలో ఒక పాదాచారుడు మృతి చెందాడు. అలాగే కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. యువకులంతా కలిసి ఓ బర్త్‌డే పార్టీకి వెళ్లి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. నలుగురిని గాంధీ ఆసుపత్రికి.. మిగిలినవారిని ఓమ్ని హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని సమీక్షించారు. కారు చౌటుప్పల్ ఎమ్మార్వో హరికృష్ణకు చెందినదిగా గుర్తించారు. ఆ కారును ఎమ్మార్వో కుమారుడు సాయి కార్తీక్ నడిపినట్టు తెలుసుకున్నారు. ఈ ఘటనపై చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఈసారి తెలంగాణ నుంచి పార్లమెంట్ స్థానానికి పోటీ చేయాలని తెలంగాణ పీఏసీ తీర్మానించింది. గాంధీ భవన్ లో సోమవారం కాంగ్రెస్ పొలిటికల్ అ÷ర్స్ కమిటీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పీఏసీ ఛైర్మన్ మాణిక్ రావ్ ఠాక్రే అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కన్వీనర్ షబ్బీర్ అలీ, వీహెచ్ తో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు. ముందుగా అధికారం ఇచ్చిన తెలంగాణ ప్రజలకు పీఏసీ కృతజ్ఞతలు తెలిపింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొలిసారి జరిగిన పీఏసీ సమావేశంలో 5 అంశాలే ఎజెండాగా చర్చించారు. పార్లమెంట్ ఎన్నికల వ్యూహం, నామినేటెడ్ పోస్టుల భర్తీ, ఆరు గ్యారెంటీల అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను పీఏసీ కన్వీనర్ షబ్బీర్ అలీ మీడియాకు వివరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రతీ పార్లమెంట్ సెగ్మెంట్ కు ఒక్కో మంత్రికి ఇంఛార్జీ బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇంఛార్జులను కాంగ్రెస్ పార్టీ నియమించింది. వచ్చే ఏడాది మార్చిలో పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా మంత్రులు, సీనియర్ నేతలను ఇంఛార్జులుగా నియమిస్తూ మార్పులు చేసినట్లు కాంగ్రెస్ హైకమాండ్ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా సీతక్క, పెద్దపల్లి పార్లమెంట్ ఇంఛార్జిగా శ్రీధర్‌బాబు, కరీంనగర్ పార్లమెంట్ ఇంఛార్జిగా పొన్నం ప్రభాకర్, నిజామాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా జీవన్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ ఇంఛార్జిగా పి.సుదర్శన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నియమించింది.మెదక్ పార్లమెంట్ ఇంఛార్జిగా దామోదర్ రాజనర్సింహ, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంఛార్జిగా తుమ్మల నాగేశ్వరరావు, సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ స్థానాల ఇంఛార్జిగా భట్టి విక్రమార్క, చేవెళ్ల, మహబూబ్‌నగర్ స్థానాల పార్లమెంట్ ఇంఛార్జిగా సీఎం రేవంత్‌రెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంఛార్జిగా జూపల్లి కృష్ణారావు, నల్గొండ పార్లమెంట్ ఇంఛార్జిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇంఛార్జిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇంఛార్జిగా కొండా సురేఖ, మహబూబాబాద్, ఖమ్మం స్థానాల పార్లమెంట్ ఇంఛార్జిగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ హైకమాండ్ నియమించింది. జనవరిలో పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపింది. ఇకపోతే ముందుగా కాంగ్రెస్ పార్టీని తెలంగాణలో అధికారంలోకి తీసుకువచ్చి సంపూర్ణ మద్దతు పలికిన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలు, నాయకులు, ఏఐసీసీ అగ్ర నేతలు, ప్రచారంలో పాల్గొన్న నాయకులు, ఇంచార్జ్‌లుగా పని చేసిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ తరపున ధన్యవాదాలు చెపుతూ తీర్మానం చేశారు. ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకున్నది. ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవమైన డిసెంబర్ 28వ తేదీ నుంచి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రకటించింది. పెన్షన్ పెంపు, మహిళలకు రూ. 2500లు, రూ. 500లకే గ్యాస్, ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి పథకాలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొంది. ఇందుకోసం గ్రామాల్లోనే గ్రామసభలు నిర్వహించి ఈ సభల ద్వారానే దరఖాస్తులు తీసుకోవడంతో పాటు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు షబ్బీర్ అలీ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ తరుపున, అటు ప్రభుత్వం తరుపున ప్రతినిధులను నియమించి గ్రామ సభలను నిర్వహించనున్నారు. సభ ద్వారా దరఖాస్తులు స్వీకరించి.. అందరి ఆమోదం తెలిపిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయనున్నారు. అయితే దీని పర్యవేక్షణకు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించనున్నారు. పథకాల అమలులో తమ కార్యకర్తలకే తొలి ప్రాధాన్యం ఉంటుందని, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గతంలోనే చెప్పినట్లు తెలిపారు. ఇక కొత్త హౌసింగ్ శాఖ ఏర్పాటు చేస్తున్నట్లు షబ్బీర్ అలీ వెల్లడించారు. రూపకల్పనపైనా సీఎం స్పష్టతనిస్తారని తెలిపారు.

# తెల్ల రేషన్ కార్డుల గుట్టు తేలేనా?

**హైదరాబాద్,డిసెంబర్18( మరో ఉదయం):**


బీఆర్ఎస్ పాలనలో పౌరసరఫరాల విభాగాన్ని అల్లకల్లోలం చేశారని, ఆ శాఖ వద్ద 90లక్షల టన్నుల ధాన్యానికి లెక్కల్లేవని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నిజానికి ఇదంతా ఎక్కడికి పోయిందన్న చర్చ సాగుతోంది. దీనిని మిల్లర్లు అమ్ముకున్నారా అన్న నిజం తేలాల్సి ఉంది. ఈ


ధాన్యం ఉందా.. లేదా..మిల్లర్లు అమ్ముకున్నరా.. ఉంటే ఎక్కడుంది అనే గందరగోళం నెలకొంది. దీనిపై సమగ్ర పరిశీలన ప్రారంభించామని మంత్రి ప్రకటించారు. పదేండ్లలో ఈ శాఖ రూ. 56 వేల కోట్ల అప్పుల్లో ఉందని బాధ్యత చేపట్టిన మంత్రి ఉత్తమ్ తొలిరోజే ప్రకటించారు. ప్రస్తుతం రేషన్ కార్డుపై ఒక్కో వ్యక్తికి 6కిలోల బియ్యం ఇస్తుండగా.. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా 5 కిలోలని, మిగతా కిలోబియ్యం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నది. ఇకపోతే రేషన్ బియ్యం చాలాచోట్ల లబ్ధిదారులకు చేరడం లేదన్నది వాస్తవం. అంతేగాకుండా ఆరోగ్యశ్రీలాంటి పథకాల కోసం చాలామంది గ్రామస్థాయిలో తెల్ల రేషన్ కార్డులు పొందారు కొత్తకార్డులు ఇచ్చే ముందు ఇలాంటి దొంగకార్డుల సంగతిని నిగ్గు తేల్చాల్సి ఉంది. బియ్యం ఎటు దారి మళ్లుతున్నాయో కూడా తేల్చాలి. ఇదంతా ఓ పెద్ద మాఫియాలాగా సాగుతోంది. దీనిని ఛేదించాలి. అప్పుడే ప్రజలకు న్యాయం జరగగలదు. ఆర్థికంగా ఆదా కాగలదు.




# రావు రమేశ్ .. మారుతి నగర్ సుబ్రమణ్యం

తెలుగులో వైవిధ్యమైన నటులు ప్రస్తుతం ఎవరైనా వున్నారు అంటే అది ఒక్క రావు రమేష్ మాత్రమే అని చెప్పొచ్చు. కామెడీ, సీరియస్, భావోద్వేగాలు ఎటువంటివైనా తనకి తానే సాటి అనిపించుకున్న రావు రమేష్ గురించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవసరం లేదు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిభావంతుడైన నటుడు. తండ్రికి తగ్గ తనయుడిగా, తనదైన శైలిలో డైలాగ్ లు చెపుతూ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. అందుకనే రావు రమేష్ ఎంపిక చేసుకునే పాత్రలు చూస్తే అవన్నీ ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా అన్నీ వెరైటీగా ఉంటాయి. ఇంకో ఆసక్తికర విషయం ఏంటంటే అతను నటించే సినిమా ఫలితం ఎలా వున్నా రావు రమేష్ పాత్రలు ఎప్పుడూ ఫెయిల్ అవలేదు, అవి ఎప్పుడూ హిట్ అవుతూ వచ్చాయి. అటువంటి నటుడు ఇప్పుడు ఓ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. టైటిల్ పాత్రలో 'మారుతి నగర్ సుబ్రమణ్యం అనే సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుందని తెలిసింది. ఇందులో అతను ప్రధాన పాత్రలో కనపడతారని, సినిమా నేపథ్యం అంతా అతని పాత్ర చుట్టూ తిరుగుతూ ఉంటుందని తెలిసింది. అతనికి జోడీగా ఇంద్రజ ఒక కీలక పాత్రలో నటిస్తోంది. 'హ్యాపీ వెడ్డింగ్' ఫేమ్ లక్షణ్ కార్య ఈ చిత్రానికి దర్శకుడు. సినిమా అంతా వినోదాత్మకంగా వుండే ఈ సినిమా మొత్తం చిత్రీకరణ పూర్తి అయిందని చిత్ర నిర్వాహకులు ఒక ప్రకటనలో చెప్పారు. 'రావు రమేష్ గారిని ఇప్పటి వరకు చాలా సినిమాలో వివిధ పాత్రలో చూసిన ప్రేక్షకులకి, ఈ సినిమాలో ఒక వినోదాత్మకమైన పాత్రలో ప్రేక్షకులు మెచ్చే విధంగా కనిపిస్తారు. అన్ని సినిమాల్లో అతని డైలాగులు ఎలా పాపులర్ అయ్యాయో, ఈ సినిమాలో కూడా అతని డైలాగ్స్ బాగా పాపులర్ అవుతాయని అనుకుంటున్నాను. ఇక చిత్రీకరణ పరంగా ఆయన మాకు ఎంతో సహాయం చేశారు. బిజీగా ఉన్నప్పటికీ, మా సినిమాకి ఎక్కువ డేట్స్ కేటాయించి సినిమా పూర్తి కావడానికి ఎంతో సపోర్ట్ చేశారు. ఈ సినిమాపై, అతను చేస్తున్న పాత్ర మీద ఆయనకు అంత నమ్మకం, ప్రేమ ఉన్నాయి. ఈ సినిమా పూర్తి వినోదాన్ని పండిస్తుంది, ప్రేక్షకులు చాలా బాగా ఎంజాయ్ చేస్తారని దర్శకుడు లక్ష్మణ్ కార్య చెప్పారు.





# 'కీ డివోర్స్ స్టాటిస్టిక్స్' పేరుతో ఇమేజ్ షేర్ చేసిన సమంత

టాలీవుడ్ అగ్ర నటి సమంత అభిమానుల కోసం కుదిరిన ప్రతిసారీ సమయం కేటాయిస్తుంటారు. సోషల్ మీడియా వేదికగా చాటింగ్ చేస్తుంటారు. ఫ్యాన్స్ అడిగిన ప్రశ్నలకు ఆసక్తికర సమాధానాలు ఇస్తుంటారు. అప్పుడప్పుడు నెటిజన్లు ఆకతాయి ప్రశ్నలు వేస్తుంటారు. అలాంటి సమయంలో సహనాన్ని కోల్పోతే ధీటుగా సమాధానం ఇస్తారు సామ్. తాజాగా అలాంటి ఘటనే సామ్‌కు ఎదురైంది.. 'మళ్లీ పెళ్లిపై మీరెందుకు ఆలోచించకూడదు?' అని తాజాగా ఓ నెటిజన్ ప్రశ్నించగా ఆమె స్పందించారు. విడాకులకు సంబంధించిన లెక్కల్ని చూపిస్తూ.. ఈ లెక్కల ప్రకారం అది బ్యాడ్ ఇన్వెస్ట్‌మెంట్ అని పేర్కొని దానికి స్మైలీ ఎమోజీ జోడించారు. 'కీ డివోర్స్ స్టాటిస్టిక్స్' పేరుతో సమంత షేర్ చేసిన ఇమేజ్‌లో.. 2023లో.. మొదటి పెళ్లి విడాకులు 50 శాతం ఉండగా, రెండో, మూడోసారి పెళ్లిళ్ల విడాకులు 67 శాతం, 73 శాతంగా ఉంది. స్త్రీ, పురుషుల విషయంలోనూ ఈ రేటింగ్ ఇలానే ఉందట' అని పేర్కొన్నారు. మరో నెటిజన మీరు దేవుడిని నమ్ముతారా? అంటే నమ్ముతానని సమంత చెప్పారు. మనం గురించి మనకు బాగా తెలుసని అనుకుంటాం. అదే సమయంలో కొన్ని సర్‌ప్రైజ్‌లు జరుగుతుంటాయి. దీనిపై మీ అభిప్రాయం ఏంటని అడగగా.. అవును.. కొంత మంచి, కొంత చెడు ఉంటుంది. ఆరెండు ఉంటేనేగా మన జీవితం యునీక్‌గా ముందుకెళ్తుంది' అని చెప్పారు. రానున్న సంవత్సరం ఎలా ఉండాలని కోరుకుంటున్నారు అన్న ప్రశ్నకు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

# అడవిశేష్, శృతిల మూవీ పేరు డెకాయిట్

టాలీవుడ్ యంగ్ హీరో అడివిశేష్ కాంపౌండ్ నుంచి ప్రస్తుతం గూఢచారి 2 రాబోతున్న విషయం తెలిసిందే. కొంతకాలంగా సందేశాత్మక కథాంశాలతో సినిమాలు చేస్తున్న అడివిశేష్ తాజాగా లవ్ స్టోరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి ఇంట్రెస్టింగ్ టైటిల్‌న్ను ÷నైల్ చేశారన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం ఈ మూవీకి డెకాయిట్ (ఆజీఇనీతిబి) టైటిల్‌ను ఫిక్స్ చేశారని వార్తలు వస్తుండగా.. మేకర్స్ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుందని ఇన్‌సైడ్ టాక్. యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఉండబోతున్న ఈ చిత్రంలో శృతిహాసన్ ఓ పాట

కూడా పాటబోతుందట. ఈ భామ మంచి సింగర్ అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. హిందీ, తెలుగు భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే శృతిహాసన్ ఫస్ట్‌గ్లింప్స్‌ను విడుదల చేశారు. ముఖంపై స్కార్ఫ్ చుట్టుకొని తీక్షణ చూపులతో సీరియస్‌గా కనిపిస్తున్నది శృతిహాసన్. డెకాయిట్గ్ ÷నైల్ అయితే ఈ ఇంట్రెస్టింగ్ టైటిల్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతుందనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు సినీ జనాలు. తొలిసారి శృతిహాసన్, అడివిశేష్ కాంబోలో సినిమా వస్తుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. షనీల్ డియో డెబ్యూ (డైరెక్టర్) ఈ చిత్రానికి కథనందిస్తూ దర్శకత్వం వహించనున్నాడు. శృతిహాసన్ రీసెంట్‌గా హాయ్‌నాన్నలో ఓడియమ్మా పార్టీ సాంగ్‌లో మెరిసి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుండగా.. ఆసియన్ సునీల్ సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. శశి కిరణ్ టిక్కా దర్శకత్వంలో వచ్చిన 'గూఢచారి' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'జీ2' (ఉ2) చిత్రానికి వినయ్ కుమార్ దర్శకత్వం వహిస్తు?న్నాడు. ఇప్పటికే అడివి శేష్.. 'జీ2' (ఉ2) నుంచి ప్రీ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేయగా.. నెట్టింట హల్ చల్ చేస్తోంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్లపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




# మిస్టర్ బచ్చన్‌గా రవితేజ

మ్యాజికల్ కాంబో- మాస్ మహారాజా రవితేజ, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో మూవీ అనౌన్స్‌మెంట్ వచ్చిందో.. లేదో, వరసగా అప్‌డేట్స్ వస్తూనే ఉన్నాయి. శనివారం హీరోయిన్‌ని పేరు, ఫస్ట్ లుక్ రివీల్ చేసిన మేకర్స్.. ఆదివారం సినిమాని పూజా కార్యక్రమాలతో ప్రారంభించేశారు. అంతేకాదు, ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ని కూడా మేకర్స్ వదిలారు. మాస్ మహారాజా రవితేజ బిగ్ బి అమితాబ్ బచ్చన్‌కి వీరాభిమాని, హిందీలో అనర్గళంగా మాట్లాడగలరనే విషయం తెలిసిందే. తన కొన్ని సినిమాలలో బిగ్ బిని అనుకరిస్తూ అలరించారు కూడా. ఇప్పుడు హరీష్ శంకర్‌తో రవితేజ చేస్తున్న క్రేజీ ప్రాజెక్ట్‌కు 'మిస్టర్ బచ్చన్' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్ పోస్టర్‌లో రవితేజ.. అమితాబ్ బచ్చన్ ఐకానిక్ పోజ్‌ను అనుకరిస్తున్నట్లుగా ప్రజెంట్ చేస్తోంది. ఈ లుక్‌లో రవితేజ పాత స్కూటర్‌పై షేడ్స్‌తో స్టైల్‌గా కూర్చుని కనిపిస్తున్నారు. అతని వెనుక నటరాజ్ థియేటర్, అమితాబ్ బచ్చన్ ఇమేజ్ చూడవచ్చు. అతను సినిమా లవరా సినిమాలో అమితాబ్ బచ్చన్‌కి వీరాభిమానా? 'బిగ్ బి-నామ్ తో సునా హోగా' అనే పాపులర్

డైలాగ్ ఈ సినిమా ట్యాగ్‌లైన్. టైటిల్ పోస్టర్ మాస్, అభిమానులు, అన్ని వర్గాల ప్రేక్షకులను ఖచ్చితంగా మెప్పిస్తుంది. ఈ మ్యాజికల్ మాస్ కాంబోలో రవితేజ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. పనోరమా స్టూడియోస్, టి-సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని ప్రజెంట్ చేస్తున్నాయి. ఆదివారం పలువురు అతిధుల సమక్షంలో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా ప్రారంభించారు. హీరో రవితేజ, నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్, వివేక్ కూచిభొట్ల, రఘు రామకృష్ణ స్క్రిప్ట్‌ను దర్శకుడు హరీష్ శంకర్‌కి అందజేశారు. రవితేజపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు కుమార్ మంగత్ పాఠక్ క్లాప్ కొట్టగా, కె రఘు రామకృష్ణం రాజు, టిజి భరత్ కలిసి కెమెరా స్విచాన్ చేశారు. ముహూర్తం షాట్‌కు వివి వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. ముహూర్తం షాట్ కోసం 'మిస్టర్ బచ్చన్... నామ్‌తో సునా హోగా!' డైలాగ్‌ని చెప్పారు రవితేజ. కాగా.. మిక్కీ జె మేయర్ సంగీతం అందించనున్న ఈ చిత్రానికి అయనంక బోస్ సినిమాటోగ్రఫీ, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనింగ్, ఉజ్వల్ కులకర్ణి ఎడిటింగ్ బాధ్యతలను నిర్వర్తించనున్నారు.





